క్లుప్తంగా

'కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా'


నగదు అందిస్తున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): ఆపదలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు భిక్షపతి మృతి చెందాడు. దీంతో సోమవారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి, రూ.5 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతి, బీఆర్‌ఎస్ నాయకులు రాంచెందర్‌గౌడ్, ఆంజనేయులు, యుద్ధంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నియామకం


నియామకపత్రం అందిస్తున్న నాయకులు

నర్సాపూర్: జిల్లా బీజేపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా నర్సాపూర్‌కు చెందిన నీరుడి చంద్రయ్యను జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాదగిరి నియమించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈమేరకు ఆయనకు ఉత్తర్వులు అందచేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్, పార్టీ నాయకులు మైపాల్, ఆంజనేయులుగౌడ్, బాల్‌రాజ్, కృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని మూడవ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ శశికళ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లలు, గర్భిణుల హాజరుతో పాటు స్టాక్ రికార్డులు తనిఖీ చేశారు. పిల్లలకు తల్లులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుమిత్ర, రజియ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలో మొలకెత్తని విత్తనం


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీఓ

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం నిర్దేశించిన నర్సరీలో విత్తనం మొలకెత్తక పోవడంతో కార్యదర్శికి మెమో జారీ చేశారు. మండలంలోని పాంబండ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలో 10 వేల మొక్కల కోసం విత్తనం నాటారు. సోమవారం నర్సరీని ఎంపీఓ తిరుపతిరెడ్డి పరిశీలించగా, 10 వేల మొక్కలకు గాను 1,000 మాత్రమే మొలకెత్తాయని పాత సీడ్ పెట్టడంతో పాటు సరైన మైంటెనెన్స్ లేకపోవడంతో సంబంధిత కార్యదర్శి నవీన్‌కు మెమో ఇచ్చినట్లు ఎంపీఓ తెలిపారు.

చెరువు అలుగు పనులు నాణ్యతతో చేయాలి


పనులను పరిశీలిస్తున్న డీఈ శ్రీకాంత్

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామంలోని పెద్ద చెరువు అలుగు పనులను నాణ్యతతో చేపట్టి, అందుబాటులోకి తేవాలని తూప్రాన్ ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని గౌతోజీగూడెం గ్రామ పెద్ద చెరువు నుంచి సికింద్లాపూర్ వరకు గల అలుగు పారకం కాల్వ మరమ్మతుల పనులను పరిశీలించారు. కాగా ఈ అలుగు పారకం కాల్వ నిర్మాణ పనుల కోసం రూ. 8.5 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఉప సర్పంచ్ రేణుకుమార్, సూపర్‌వైజర్ రాజు తదితరులున్నారు.

16న 'మోడల్' ప్రవేశ పరీక్ష

రేగోడ్(మెదక్): స్థానిక మోడల్ స్కూల్‌లో ఈనెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ జయప్రకాశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 100 సీట్ల భర్తీ కోసం విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఏడో తరగతి నుంచి పదో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: సీపీఆర్‌పై అంద రికి అవగాహన అవసరమని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని షాదీఖానాలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై.. సీపీఆర్ ఎలా చేయాలో చేసి చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్వాస ఆగినప్పుడు సీపీఆర్ ప్రక్రియ ప్రాణం కాపాడేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. అందరు అత్యవసర సమయంలో సీపీఆర్ ప్రక్రియ ఉపయోగించి ప్రాణం కాపాడితే అంతకన్న మేలు మరోటి ఉండదన్నారు. గుండె పని చేయడం నిలిచిపోయినప్పుడు సీపీఆర్‌తో గుండె పని చేసే అవకాశం ఉన్నందున సీపీఆర్‌కు సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు సీఎం శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయ నిర్మల, జెడ్పీటీసీ బబియానాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, కౌన్సిలర్ రాంచందర్, పలువురు పార్టీ నాయకులు నర్సింగ్‌రావు, శేఖర్, హబీబ్‌కాన్, భిక్షపతి, నగేష్ ఆంజనేయులుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పంటలు భద్రం


పంటను పరిశీలిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే వరి పంటను కాపాడుకోవచ్చని మండల వ్యసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అజ్జమర్రి, గంగారం గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. వరి పంటల్లో అగ్గితెగులు, మెడవిరుపు తెగులు ఉందన్నారు. అగ్గితెగులు నివారణకు ట్రై సైక్లోజల్ 0.6 గ్రాముతో పాటు మాంకోజెబ్ 0.25 గ్రాము, లేదా కాసుగామైసిన్ 2.5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా మెడవిరుపు తెగులు సోకిన పొలాల్లో కంకి కణుపు వద్ద నల్లని మచ్చలు ఏర్పడి కుంకుల్లోకి పోషకాలు అందక మెడలు విరిగి వ్రేలాడుతూ ఉంటాయన్నారు. ట్రైసైక్లోజల్‌తో పాటు మాంకోజెబ్ 2.5గ్రాము, లేదా ఐసోప్రోథయోలిన్ 1.5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి 10–15 రోజుల వ్యవధిలో రెండె సార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భూపాల్, అజ్జమర్రి సర్పంచ్ పరశురాంరెడ్డి, రైతు సమన్వయ కర్త వీరాస్వామి, రైతులు పాల్గొన్నారు.

బేతాళ స్వామికి బోనాలు


బోనాలతో భక్తులు

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రం అల్లాదుర్గం భేతాళస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి బోనాలు, గండజ్యోతిని ఎత్తుకొని, ఊరేగించి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి సమర్పించారు. బేతాళ స్వామి బోనాలు తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు, కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వచ్చారు. ఉత్సవాల్లో ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వచ్ఛభారత్ మిషన్‌పై శిక్షణ


ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కొల్చారం(నర్సాపూర్): పరిశుభ్ర భారతావనిని నిర్మించాలన్న లక్ష్యంగా గ్రామీణ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సోమవారం మండల కేంద్రం కొల్చారంలో స్వచ్ఛభారత్ మిషన్ ఫేస్–1 లో భాగంగా మండల స్థాయి ప్రజాప్రతినిధులకు, అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొదటిరోజు ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలను నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. పరిశుభ్రత కోసం ప్రభుత్వం తీసుకుంటున్నటు వంటి చర్యలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ సమిష్టితో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శిక్షకులు గ్రామీణ స్థాయిలో చెత్త సేకరణ, డంప్‌యార్డుల నిర్వహణ, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షకులు మహిపాల్‌రెడ్డి, ప్రకాష్, మోజీబ్, గ్రామ సర్పంచ్‌లు మండల, గ్రామీణ స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


క్రీడా సామగ్రి అందిస్తున్న రవినాయక్

శివ్వంపేట(నర్సాపూర్): యువత వారికి నచ్చిన క్రీడల్లో రాణించాలని జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు రవినాయక్ అన్నారు. మండల పరిధిలోని సీతారం తండాకు చెందిన క్రీడాకారులకు సోమవారం క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం కల్గుతుందని అన్నారు. యువతి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని విద్యార్థులు, సర్పంచ్ రాములుతో కలిసి గ్రామంలోని చేగుంట – బోనాల్ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అధికారులకు పదోతరగతి పరీక్ష కేంద్రం అవసరం గురించి వివరించినా.. కేంద్రం ఏర్పాటు చేయలేదన్నారు. పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తే రుక్మాపూర్, పులిమామిడి కిష్టాపూర్ విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి, పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసే వరకు పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, చంద్రం, బాలకుమార్, విజయ్‌తో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భూముల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోండి

చిన్నశంకరంపేట(మెదక్): అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో నివాస గృహాలు నిర్మించుకున్న వారు ప్రభుత్వ భూములను క్రమద్ధీకరణకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహేందర్‌గౌడ్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో ఇంటి నిర్మాణం చేసిన వారు జీఓ58, 59 ప్రకారం దరఖాస్తులు అందించాలని సూచించారు. ఈ నెల 30 వరకు తమ దరఖాస్తులను మీ సేవా కేంద్రంలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వ్యర్థాలు పొలాల వద్ద వేయొద్దు


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామంలో సేకరించిన చెత్త, వ్యర్థాలు వ్యవసాయ పొలాల వద్ద వేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రం శివ్వంపేటలో గ్రామ పంచాయతీ సిబ్బంది సేకరించిన చెత్త, వ్యర్థాలు పాడుపడిన బావి వద్ద వేస్తుండడం వల్ల కుక్కల సంచారం పెరిగిపోయిందని రైతులు మల్లేశ్, శ్రీనివాస్, బాలేశ్, రవి, స్వామి, అశ్విన్ అన్నారు. సమీపంలో ఉన్న పశువులు, మేకలపై కుక్కలు దాడులు చేస్తు గాయపరుస్తున్నాయని వాపోయారు. మూడు రోజుల్లో లక్ష్మయ్యకు చెందిన మేక, శ్రీనుకు చెందిన లేకదూడపై కుక్కలు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక భరోసా

నిజాంపేట(మెదక్): మండలంలోని నందిగామ గ్రామంలో తన స్నేహితుడి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి 2000వ సంవత్సరం పదో తరగతి స్నేహితులు ఆర్థిక భరోసా కల్పించారు. ఈ మేరకు సోమవారం నందిగామ గ్రామంలో బిజ్జ బాగయ్య కుమారుడు రోడ్డు ప్రమాదంలో గాయాలు పాలై మరణించడంతో అతని కుటుంబానికి పదో తరగతి స్నేహితులు రూ. 23 వేల ఆర్థిక భరోసా కల్పించారు. కార్యక్రమంలో జీపీ స్వామి, భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

మెదక్‌కు తరలిన విశ్రాంత ఉద్యోగులు

రామాయంపేట(మెదక్): తమ డిమాండ్ల సాధనకై సోమవారం మెదక్‌లోని కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ఆందోళనలో పాల్గొనడానికి రామాయంపేట నుంచి విశ్రాంత ఉద్యోగులు మెదక్ తరలివెళ్లారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): విశ్రాంతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ పెన్షనర్ అసోసియోషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమానికి మండల రిటైర్డ్ ఉద్యోగులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెండింగ్ డీఏలు, క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌లను, కొత్త పీఆర్‌సీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో రిటైర్డ్ సంఘం మండల శాఖ అధ్యక్షుడు విఠయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, కోశాధికారి నర్సింలు, సభ్యులు నారాయణ, మల్లయ్య, షాహెద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను గెలిపిస్తే తండాలను అభివృద్ధి చేయిస్తా'

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్‌ను గెలిపిస్తే తండాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరీంనగర్ గ్రామం కుక్కలగుట్ట తండాలో సోమవారం శ్రీనివాస్‌రెడ్డి ఆత్మగౌరవ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలో పర్యటించి కొమురం భీం విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం గిరిజనులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, ఆగం, శ్రీనివాస్, స్టాలిన్, తాహెర్, శంకర్‌నాయక్, రాజు, బద్యానాయక్, విఠల్, స్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


అద్దాలు అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్ రూరల్: కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం మండలంలోని చిప్పల్‌తుర్తిలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమం ఎమ్మెల్యే పరిశీలించారు. మహిళలకు ఉచితంగా అద్దాలు, మందులు అందించారు. అనంతరం ఇటీవల చిప్పల్ తుర్తి గ్రామ పంచాయతీకి రాష్ట్రస్థాయిలో సుపరిపాలన అందించినందుకు అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్యామల లక్ష్మణ్‌గౌడ్, గ్రామ కార్యదర్శి సురేఖ ఇతరులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాబ్యానాయక్, ఎంపీపీ వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): పేద, మధ్య తరగతి కుటుంబాల కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబురావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కృష్ణారావు, విరేష్, శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతిగౌడ్, నరేందర్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నిర్వాసితులకు పట్టాల పంపిణీ

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన 160 ఇళ్లు, మరో 191 ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన పట్టా సర్టిఫికెట్లను సర్పంచ్ స్వామి సోమవారం పంపిణీ చేశారు. ;. నిర్వాసితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు.

మట్టి తవ్వకాలను అడ్డుకోవాలి


ఉపతహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): శిఖం భూముల్లో నుంచి రాత్రి వేళల్లో మట్టి తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని చెండి గ్రామ పంచాయతీ పరిధిలోని చామన్‌చెరువు శిఖం భూమిలో నుంచి జేసీబీతో మట్టి తవ్వకాలు చేస్తున్న ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామానికి చెందిన అల్లం రమేశ్ ఎలాంటి అనుమతుల లేకుండా చెరువు శిఖం భూముల్లో నుంచి మట్టి తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నాడని రైతులు అనీల్, అశోక్, రాములు, రవి, శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం తవ్వకాలు చేస్తున్న విషయం సంబంధిత అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదని వాపోయారు. వాల్టా చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉప తహసీల్దార్ ప్రభుదాస్‌కు వినతిపత్రం అందజేశారు.

ఫైలేరియా నివారణకు చర్యలు


వ్యాధి కిట్లు అందిస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): క్యూలెక్స్ దోమ కాటుతో బోధకాలు వ్యాధి వస్తుందని, బోధకాలు వ్యాధి వ్యాపించకుండా ప్రతీ ఒక్కరు దోమతెరలను వాడాలని ప్రగతి ధర్మారం వైద్యాధికారి హరిప్రియ అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలో చల్మెడ గ్రామంలో బోధకాల వ్యాధి బాధితులకు ఫైలేరియా నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ, వారికి డాక్టర్ హరిప్రియ, జిల్లా మలేరియా అధికారి కుమారస్వామి కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రగతి ధర్మారం ఆరోగ్య కేంద్రం పరిధిలో 565 మందికి బోధకాలు వ్యాధి వ్యాపించిందన్నారు. చల్మెడ గ్రామంలో 48 మందికి బోధకాలు వ్యాధి సోకిందని, వ్యాధి సోకకుండా గ్రామస్తులు దోమతెరలు వాడాలన్నారు. అదేవిధంగా వ్యాధి సోకిన వారు తగు జాగ్రత్తలు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ తుమ్మల రమేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పాస్ పుస్తకాలు ఇవ్వండి'


ఆర్‌ఐకి వినతిపత్రం అందిస్తున్న రైతులు

నర్సాపూర్: తమకు ప్రభుత్వం అందజేసిన పట్టా సర్టిఫికెట్లు ఉన్నాయని, తమకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని నత్నాయిపల్లి గ్రామానికి చెందిన నీలి జయమ్మ, గానుగు వీరమణి, తలారి లక్ష్మి, మీసాల ఎల్లమ్మ, జాజాల మంజుల తదితరులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు 2005 సంవత్సరంలో ప్రభుత్వం అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చేతుల మీదుగా ధర్మారం గ్రామంలోని 18 సర్వే నంబరులోని 23ఎకరాల 32గుంటల భూమికి 20మంది రైతులకు పట్టాలు అందజేశారని మండల ఆర్ఐ ఫైజల్‌కి ఇచ్చిన వినతిపత్రంలో వివరించారు. తాము అప్పటి నుంచి ఆ భూమిని సాగు చేసుకుంటున్నామని చెప్పారు. కాగా ధరణి వచ్చినప్పటి నుంచి తమకు కొత్త సమస్యలు తలెత్తాయన్నారు. తమకు కొత్త పాస్ పుస్తకాలు రానందున తమకు రైతుబంధు సాయం సైతం అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పట్టాలు ఉన్నందున పాస్ పుస్తకాలు అందజేయాలని రైతులు ఆర్ఐని కోరారు. కాగా ఆర్ఐ స్పందిస్తూ.. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని రైతులకు ఆయన హామీ ఇచ్చారు.

ఇంటింటికీ బీజేపీ సంక్షేమ పథకాలు


కరపత్రాలు పంచుతున్న నాయకులు

రామాయంపేట(మెదక్): పల్లె పల్లెకు ఓబీసీ – ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా పార్టీ ఓబీసీ విభాగం కార్యకర్తలు స్థానిక మున్సిపాలిటీలోని దుర్గమ్మ గల్లీలో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను వివరించారు. పట్టణ ఓబీసీ అధ్యక్షుడు కార్తీక్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బస్తీలో ఇంటింటికి తిరిగి కేంద్రంలో బీజేపీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రధాని చొరవతో నేడు మన దేశానికి ప్రపంచంలోనే తగిన గుర్తింపు వచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఇంటింటికి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో నాయకులు పోచమ్మల లక్ష్మీనారాయణ, మంగళి నారాయణ, మేర గోపీనాథ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యుల ఎంపికకు నోటిఫికేషన్ జారీ


మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో నలుగురు కోఆప్షన్ సభ్యుల ఎంపిక కోసం మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. మున్సిపల్ పరిపాలన విషయమై ప్రత్యేక పరిజ్ఞానం ఉన్నవారిని ఇద్దరిని, అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ఇద్దరిని కోఆప్షన్ సభ్యులుగా ఎన్నుకోనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ చట్టం విషయంలో అనుభవంతో పాటు 21 ఏళ్ల పైబడ్డ వారు మాత్రమే అర్హులని, నలుగురిలో ఇద్దరు తప్పనిసరిగా మహిళ అయి ఉండాలని సూచించారు. అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన వారిలో ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు పోటీ చేయడానికి అర్హులని, మున్సిపల్ కౌన్సిల్ ఓటర్ జాబితాలో ఓటర్ అయి ఉండాలనఆనరు. ఈనెల 12 నుంచి 18 లోగా మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ వేసుకోవాలని, అనంతరం మూడు రోజులవరకు అంటే 21 వరకు స్క్రుటినీ ఉంటుందన్నారు. 22న పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి గ్రామ శివారులోని మహిమానిత్వ శ్రీ గోనే మైసమ్మ ఉత్సవాలు ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో సోమవారం వాల్ పోస్టర్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, ఆంజనేయులు, ఉత్సవ కమిటీ సభ్యులు నర్సింలు, కృష్ణాగౌడ్, శేఖర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశం, ఆశోక్‌గౌడ్, శ్రవణ్ తదితరులున్నారు.

పేద ముస్లింలకు రూ.2 లక్షల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: రంజాన్ పండగను పురస్కరించుకొని నిరుపేద ముస్లింలకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి రూ.రెండు లక్షలు ఆర్థికసాయం చేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని షాదీఖానాలో ముస్లిం మత పెద్దల సమక్షంలో సఫా–బైతుల్–మాల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద ముస్లింల కుటుంబాలకు రూ.2 లక్షలు ఆర్థికసాయం అందించారు. పేదరికంలో ఉన్న ముస్లింలు సంబంధిత నాయకుల ద్వారా తనను సంప్రదిస్తే తోచినంత సాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మౌలానా జావిద్, సయ్యద్ ఖలీల్, సయ్యద్ హసన్ మొహమ్మద్, సాజియోద్దీన్ కబీల్, ఆసిఫ్ అలీ ఇక్బాల్, మీర్ అస్టర్ అలీ, సలాం, హాఫీజ్ మొల్‌సాబ్, కౌన్సిలర్ కృష్ణాగౌడ్, సర్పంచ్‌లు నోముల శ్రీకాంత్, యామిరెడ్డి, సాయా గౌడ్, మహిపాల్ రెడ్డి, శ్రీను నాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ గోపాల్ రావు, పార్టీ యువ నాయకులు మద్దెల భాస్కర్, ప్రశాంత్, స్వామి నాయక్, తదితరులు ఉన్నారు.